


పునరావాస కేంద్రంలోని బాధితులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మంత్రి తుమ్మల భరోసా

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు గురువారం ఖమ్మంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని కాల్వొడ్డు, మోతినగర్, దంసలాపురంతో పాటు పలుకాలనీలను సందర్శించి అధికారులు చేపట్టిన సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నయాబజార్ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి వెళ్లిన ఆయన అక్కడి వరద బాధితులతో మాట్లాడారు. వారికి అందుతున్న సహాయం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ గోడు వెలిబుచ్చగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. జరిగిన నష్టాన్ని తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మున్నేరు వెంట రక్షణగోడలు త్వరగా పూర్తిచేస్తామని, వరద రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.


మున్నేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్


ఖమ్మం పాతవంతెన వద్ద మున్నేరు ఉధృతి

మున్నేరు ముంచెత్తింది

ఏటా వానాకాలం వచ్చిందంటే చాలు మున్నేటి పరివాహక ప్రాంతాల వారికి కంటి మీద కునుకు ఉండదు. కానీ ఈ ఏడాది వానాకాలంపోయింది కదా అని ఊపిరిపీల్చుకునే లోపే మున్నేరు ముంచెత్తింది. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎగువన ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లాలో పడిన భారీ వర్షాలతో మున్నేరు ఉగ్రరూపం దాల్చుతోంది. గురువారం రాత్రి 10గంటలకు 26 అడుగులకు నీటిమట్టం చేరింది. ఫలితంగా నగరంతో పాటు రూరల్ మండల పరిధిలో ఉన్న పరివాహక కాలనీల్లోని 191 కుటుంబాలకు చెందిన 471మందిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వచ్చింది. గతేడాది నవంబరు 1న మున్నేటికి వచ్చిన వరదదెబ్బ నుంచి ఇంకా కోలుకోక ముందే మళ్లీ వరద ముంచెత్తడంతో వారంతా భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. విలువైన వస్తువులు, దుస్తులతో తమ ఇళ్లను వదిలి యంత్రాంగం అండతో సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు.

- 26 అడుగులకు చేరిన వరద.. రాత్రి స్వల్పంగా తగ్గుముఖం
- ఖమ్మం నగరంలోని పలు కాలనీల్లోకి వరదనీరు
- పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రజల తరలింపు
- అప్రమత్తంగా యంత్రాంగం
- బాధితులకు మంత్రి తుమ్మల భరోసా
- ఏటా ఇదే పరిస్థితి.. భయం భయంగా ప్రజలు
- చితికిపోతున్న కుటుంబాలు
- గతేడాది వరద భయం తొలగకముందే
- రిటైనింగ్‌వాల్స్ పూర్తయితేనే రక్షణ


ప్రభావతి నగర్‌లోని ఓ ఇంట్లో నుంచి ప్రవహిస్తున్న నీరు

ఖమ్మం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎగువన వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలోని పరీవాహక ప్రాంతాల్లో పడిన భారీ వర్షాలతో ఖమ్మం వద్ద మున్నేరు నది ఉప్పొంగుతోంది. గురువారం రాత్రి 9గంటలకు 26అడుగులకు చేరి.. 10గంటల తర్వాత స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో ఖమ్మం నగరంలో వరద ఉధృతితో లోతట్టుకాలనీలు జలమయమయ్యాయి. బుధవారం ఉదయం 8.5 అడుగులున్న ప్రవాహం క్రమంగా పెరుగుతూ వచ్చి గురువారం సాయంత్రానికి 25.80అడుగులకు చేరింది. దీంతో మున్నేరు పరివాహక ప్రాంతంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతినగర్, ప్రకాశ్‌నగర్, దంసలాపురం తదితర కాలనీల్లోని నివాసాల్లోకి నీరు చేరింది. అయితే బుధవారం మధ్యాహ్నం నుంచే అప్రమత్తమైన జిల్లా, కార్పొరేషన్ యంత్రాంగం సాయంత్రం నుంచి మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజల్ని అప్రమత్తం చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ, పోలీసు, రెవెన్యూ, డీఆర్ఎఫ్ బలగాల ద్వారా నయాబజార్ కాలేజీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. బుధవారం రాత్రి 12గంటల వరకు కూడా సహాయక చర్యల్లో ఉన్న యంత్రాంగం 71కుటుంబాలకు చెందిన 170 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. చాలామంది వారి నివాసాల్లోని విలువైన వస్తువులు, విద్యుత్ పరికరాలను మైదాన ప్రాంతంలోని బంధువులు, స్నేహితుల నివాసాలకు తరలించారు. కొన్ని దుస్తులను మాత్రమే తీసుకుని పునరావాస కేంద్రాలకు వెళ్లారు. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి 1గంట వరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మున్నేరు పరివాహక ప్రాంతంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆ సమయంలోనూ కమిషనర్ అభిషేక్ అగస్త్య నయాబజార్ పునరావాసకేంద్రానికి వెళ్లి బాధితులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఇక గురువారం ఉదయం మున్నేరు ఉధృతి 25అడుగులకు చేరింది. ముంపు తగ్గుతుందని భావించినా.. ఇంకా పెరగటంతో (మిగతా 6వ పేజీలో)


సురక్షిత ప్రాంతానికి వెళుతున్న ముంపు బాధితుడు

ఖమ్మం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మొంథా తుఫాన్ జిల్లా రైతులను నిండా ముంచింది. ప్రతీసారి పంట చేతికి వచ్చే తరుణంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులకు శాపంగా మారుతున్నాయి. అయితే అధిక వర్షాలు.. లేకుంటే వర్షాభావ పరిస్థితులు.. అదీ కాకుంటే తుఫాన్ వర్షాల బీభత్సంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఫలితంగా చేతికి వచ్చిన పంటలు చేనులోనే పడిపోతున్నాయి. ఏడాది పొడవునా వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంట అమ్మి సొమ్ము చేసుకుందామని ఆశిస్తున్న రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇదే కోవలో ఊహించని విధంగా వచ్చిన మొంథా తుఫాన్.. జిల్లా రైతాంగానికి అపార నష్టం, కష్టం తెచ్చి పెట్టింది. జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఈదురుగాలులు, వర్షాలతో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలు దెబ్బతిన్నాయి. ఎకరానికి రూ.25వేల పైగా పంటనష్టం ఉంటుందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. జిల్లా వ్యవసాయశాఖ ఇప్పటికే ప్రాథమిక అంచనాలు సిద్ధం చేయగా.. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వీలైనంత త్వరలోనే పూర్తిస్థాయి సర్వేకు సిద్ధమైంది.

జిల్లాలో 43,104మంది రైతులకు సంబంధించి 62,400 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా వరి 24321మంది రైతులకు చెందిన 36893 ఎకరాలు, పత్తి 16544మంది రైతులకు చెందిన 22574 ఎకరాలు, పప్పుధాన్యాలు ఐదుగురు రైతులకు చెందిన 10 ఎకరాలు, మిర్చితో పాటు ఇతర కూరగాయ పంటలు 2234మంది రైతులకు చెందిన 2923 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. జిల్లాలో రెండోతీతకు వచ్చిన పత్తి వర్షాలకు రాలిపోయింది. నాణ్యతా దెబ్బతింది. దీంతో పంట దిగుబడులు తగ్గుతున్నాయని పత్తి రైతులు వాపోతున్నారు. పెట్టుబడులు భారీగా పెట్టిన పంట చేనులోనే నష్టపోవడంతో.. ఏం చేయాలో తెలియక రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వరి పంట కూడా తుఫాన్‌తో నేలవాలింది. జిల్లా వ్యాప్తంగా కోత, పొట్టదశలోని వరి పొలాలు కొన్నిచోట్ల నీటిలో మునగగా, మరికొన్ని నేలబారాయి. అలాగే మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని, పూర్తిస్థాయి నివేదికలు వచ్చిన తర్వాత ఎకరానికిరూ.10వేలపరిహారం అందిస్తామని ప్రకటించారు రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.


కొణిజర్లలో నేలవాలిన వరి

మొంథార్ణవం!

- చేతికొచ్చిన పంట చేనులోనే నీటిపాలు
- నిండా మునిగిన జిల్లా రైతులు
- క్షేత్రస్థాయిలో అంచనాల్లో వ్యవసాయశాఖ
- ప్రాథమికంగా 62,400 ఎకరాల్లో పంటనష్టం
- పత్తి, మిర్చి, వరి నీటిపాలు


కూసుమంచి మండలం రాజుపేటలో నేలవాలిన వరి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ. 50వేల నష్ట పరిహారం ఇవ్వాలి
- మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలి
- బీసీ రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- జిల్లాలో పంట నష్టాన్ని పరిశీలించిన సీపీఎం రాష్ట్ర కమిటీ 6


రఘునాథపాలెంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దూసుకొచ్చిన మృత్యువు

- బస్సును వెనుకనుంచి అతివేగంగా ఢీకొట్టిన లారీ
- ఇద్దరు మృతి.. మరొకరికి గాయాలు
- బస్సు డిక్కీలో లగేజీ దించుతుండగా ప్రమాదం 6


రామకృష్ణ (ఫైల్)


ఉపేందర్ (ఫైల్)

ఫలించని ప్రయత్నాలు

- దొరకని వ్యాను డ్రైవర్ మురళీకృష్ణ ఆచూకీ
- నిమ్మవాగులో రోజంతా సాగిన గాలింపు చర్యలు
- రంగంలోకి దిగిన 20మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం
- రాత్రవడంతో గాలింపు నేటికి వాయిదా 6


గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత దిశగా..

- ఆశ్రమాల్లో అత్యుత్తమ ఫలితాల కోసం కసరత్తు
- ఐటీడీఏ పీఎంఆర్‌సీకి మ్యాథ్స్, సోషల్ మెటీరియల్ తయారీ
- ఈ నెలతో ముగియనున్న పదో తరగతి సిలబస్ బోధన

భద్రాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధన కోసం కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా భద్రాచలం, ఉట్నూరు ఐటీడీఏల పరిధిలోని ప్రాజెక్టు మానిటరింగ్ రిసోర్సు సెంటర్(పీఎంఆర్‌సీ)లకు 'పది'కి సంబంధించిన మెటీరియల్ తయారీ బాధ్యతలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ క్రమంలో భద్రాచలం పీఎంఆర్‌సీకి లెక్కలు, సాంఘికశాస్త్రం, ఉట్నూరు పీఎంఆర్‌సీకి ఫిజిక్స్, బయోలాజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను రూపొందించే బాధ్యతలను అప్పగించారు. ఈ నేపథ్యంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పీఎంఆర్‌సీ ఏసీఎంవో కె.రమేష్ ఆధ్వర్యంలో 13మంది ఉపాధ్యాయుల బృందం ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌కాపీని వీలైనంత త్వరలో గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులకు పంపనున్నారు. అక్కడ ఉన్నతాధికారులు స్టడీ మెటీరియల్ ముద్రణ బాధ్యతలను నిర్వహించనున్నారు. అనంతరం వాటిని అన్ని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలకు పంపనున్నారు.

వంద శాతం ఫలితాలే లక్ష్యంగా..

పదో తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పీఎంఆర్‌సీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే 60 నుంచి 70 శాతం సిలబస్ బోధన పూర్తయిందని, మిగిలిన భాగం ఈ నెలాఖరుతో పూర్తి చేయనున్నారని పేర్కొంటున్నారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 45 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉండగా.. అందులో సుమారు 2,200 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలకు హాజరు కానున్నారు. వీరికి ప్రస్తుతం ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఫలితాల అనంతరం విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాన్ని పరిశీలించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. ఇదే సమయంలో ఆశ్రమ పాఠశాలల్లో స్టడీ అవర్స్ ఇతరత్రా అంశాలను పరిశీలించేందుకు దత్తత అధికారులను సైతం నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఇంకా చేపట్టాల్సి ఉంది. గత విద్యా సంవత్సరంలో 22 ఆశ్రమ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఫలితాలు రావడం జరిగింది. మొత్తమ్మీద 93.05 శాతం ఫలితాలు రావడంతో ఈసారి ఫలితాలు సైతం వందశాతం ఉండాలనే లక్ష్యంతో అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.






వీసీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి తుమ్మల ● పాల్గొన్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్, ఇతర అధికారులు

క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల సెలవులు రద్దు
- మొంథా తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాలలో క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని రుక్మిణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారి ఇన్‌చార్జ్‌గా పెట్టాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల సెలవులను రద్దు చేయాలన్నారు. అలాగే కలెక్టరేట్‌లలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్అండ్‌బీ పంచాయతీరాజ్‌కు సంబంధించి దెబ్బతిన్న రోడ్లు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలను పునఃప్రారంభించాలన్నారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. నగర పరిధిలో మున్నేరు నది ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో 90 కుటుంబాల పరిధిలో 227 సభ్యులను పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన ఆహారం, పారిశుధ్యం, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అతి తక్కువ ఆస్తి నష్టం, ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాన్ వల్ల 24 చోట్ల రోడ్లపై నీటి ప్రవాహం రావడం వల్ల రాకపోకలు నిలిపి వేశామన్నారు. జిల్లాలో ఉన్న చెరువులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం డీఆర్వో పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, నీటిపారుదలశాఖ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత,సీపీఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

3.5కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రరెడ్డి

మణుగూరు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని పాత మణుగూరు గ్రామంలో పోలీసులు జరిపిన దాడుల్లో మూడున్నర కిల్లో గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు.. మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం పాత మణుగూరు గ్రామంలో గాంధీబొమ్మ సెంటర్‌లో గల చల్లా శ్రీనివాస్ ఇంట్లో సోదాలు నిర్వహించగా మూడున్నర కేజీల గంజాయి లభ్యమైందన్నారు. శ్రీనివాస్‌ను విచారించగా తన కుమారుడు అయిన చల్లా సతీష్ అతని స్నేహితుడు రేపాకుల సాగర్ కలసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలంటే గంజాయి అమ్మితే వస్తామని చెప్పి వారిద్దరూ కలసి సీలేరు నుంచి గంజాయిని తీసుకొచ్చి అమ్ముతుంటారని తెలిపాడు ఇదే క్రమంలో తను కూడా అమ్ముకొవచ్చనే ఉద్దేశంతో ఇంట్లో గంజాయి నిల్వ ఉంచి అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిపాడు. ఇంటో నిల్వ ఉంచి విక్రయిస్తున్న 3.500 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకుని శ్రీనివాస్‌పై, చల్లా సతీష్, రేపాకుల సాగర్‌పై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చల్లా శ్రీనివాస్‌ను ఈ రోజు రిమాండ్‌కు పంపగా, అంతకు ముందు చల్లా సతీష్, సాగర్‌లు ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన ఇద్దరిపై కేసు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలో కొనుగోలు చేసిన గంజాయిని వాడుకుని మిగతాది విక్రయించేందుకు వస్తున్న ఇద్దరిని దాడిచేసి పట్టుకుని వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదుచేసిన సంఘటన గురువారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెడు వ్యసనాలకు అలవాటు పడిన మండలంలోని కిష్టారంకు కువ్వారపు సతీష్‌కుమార్, మరో మైనర్ బాలుడు కలిసి ఈనెల 25న ఆంధ్రా-ఒడిస్సా సరిహద్దులోని అవులపాకలో భగవాన్ అనే వ్యక్తి వద్ద అరకిలో గంజాయి కొనుగోలు చేసి స్వగ్రామాలకు వచ్చారు. స్థానిక మెట్టాంజనేయ స్వామి ఆలయం సమీపంలోని వైకుంటధామం వద్ద గంజాయిని పీల్చి మిగతాది డబ్బుల కోసం ఎవరికైనా విక్రయిద్దామని వస్తున్నారు. అదే సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానం రాగా పారిపోతుండగా దాడిచేసి పట్టుకోగా వారివద్ద నుంచి 100గ్రాముల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సత్తుపల్లి పోలీసులు తెలిపారు.

భద్రాచలంలో...

భద్రాచలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద గురువారం భద్రాచలం ఎక్సైజ్ అధికారులు రూ.12.50 లక్షల విలువైన 24.9 కేజీల గంజాయిని కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. అలాగే కారులో గంజాయి తరలిస్తున్న మహమ్మద్ హుస్సేన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగా వ్యక్తి మృతి

● ఐదుగురిపై కేసు నమోదు

జూలూరుపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందటంతో ఐదుగురిపై గురువారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ బాదావత్ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బానోత్ కబీర్‌దాస్(45) అతని సోదరుడి కుమారుడు బానోత్ లింగాకు మధ్య గతకొంత కాలంగా భూవివాదం నెలకొంది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య భూవివాదం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో లింగా, అతని భార్య సునీతలు కలసి, గ్రామస్థులు బానోత్ హేమ్లా, బానోత్ కిషన్, గుగులోత్ కృష్ణల ప్రోద్బలంతో కబీర్‌దాస్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారు పెడుతున్న ఇబ్బందులను తట్టుకోలేక ఈ నెల 21న కబీర్‌దాస్ ఇంట్లో పురుగులమందు సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు అతడిని వెంటనే కొత్తగూడెంలోని ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్సలు అందిస్తున్నారు. చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు బానోత్ నందు ఫిర్యాదు మేర కు ఐదుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

- ఎకరాకు రూ. 50వేల నష్ట పరిహారం ఇవ్వాలి
- మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ
- జిల్లాలో పంట నష్టాన్ని పరిశీలించిన సీపీఎం రాష్ట్ర కమిటీ

ఖమ్మం అర్బన్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం ఇవ్వడంతో పాటు నాణ్యత నిబంధనలు విధించకుండా పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకులు జిల్లాలో పర్యటించి తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించారు. సీపీఎం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు జాన్ వెస్లీ, నున్నా నాగేశ్వరరావుతో పాటు రాష్ట్ర కమిటీ నేతలు పోతినేని సుదర్శన్, అబ్బాస్, బుర్రిప్రసాద్, శ్రీరాం, నరేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వై. విక్రమ్, నవీన్ రెడ్డి, తదితరులు కామేపల్లి, కారేపల్లి, రఘునాద పాలెం మండలాల్లో పర్యటించారు. నష్టపోయిన పత్తి, వరి తదితర పంటలను పరిశీలించడంతో పాటు బాధిత రైతులతో మాట్లాడి నష్టాన్ని వారు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే విధంగా పోరాడుతామని భరోసా ఇచ్చారు.. అనంతరం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాన్ వెస్లీ మాట్లాడుతూ.. గతంలో కనీవినీ ఎరుగని విధంగా ఈ ఏడాది పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేని నష్టానికి గురయ్యారన్నారు. తాము స్వయంగా పంటలను పరిశీలించగా.. కోతకు వచ్చిన పత్తి కాయలు నల్లగా మారి, రాలిపోయి ఉన్నాయన్నారు. అలాగే వరి పైరు కోతకొచ్చిన దశలో నేలవాలిపోవడంతో రైతులకు దిగుబడి విపరీతంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు పత్తి, వరి తదితర పంటలు వర్షానికి తడిచాయన్న సాకుతో దళారులు రైతులను దోచుకో జూస్తున్నారని ఆరోపించారు. అందువల్ల ప్రభుత్వం రంగంలోకి దిగి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాల కారణంగా ఈ ఏడాది మొదటి నుంచి పంటలకు గండం ఏర్పడిందన్నారు. ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టు.. వర్షాలు విరుచుకు పడడంతో వేల కోట్ల విలువ చేసే పంటలకు నష్టం ఏర్పడిందన్నారు. పంటలను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి నిధులు కేటాయించాలన్నారు. బాధిత రైతులను ఆదుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన విషయం కాగా.. రిజర్వేషన్ల అమలుకు కేంద్రం సహకరించక పోతుండడం శోచనీయమన్నారు. రిజర్వేషన్లకు కేంద్రంలోని బీజేపీ అడ్డుపడుతున్న విషయం తెలిసి కూడా రాష్ట్రంలోని బీజేపీ నాయకులు రిజర్వేషన్లకు అనుకూలంగా మాట్లాడుతూ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రయత్నం తాము చేశామన్న సాకుతో ఉపేక్షిస్తే లాభం లేదన్నారు. అఖిలపక్ష పోరాటంగా మార్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. రిజర్వేషన్లకు బీజేపీ అడ్డం పడుతున్న తీరును బీసీలు అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ జేఏసీ చేస్తున్న ఆందోళనకు సీపీఎం మద్దతు తెలుపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదారు వేల ఉద్యోగాలకు మించి కొత్తగా ఇచ్చిందేమీ లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగ హక్కులను హరిస్తోందన్నారు. రాజ్యాంగబద్ధంగా కాకుండా మనుధర్మం ప్రాతిపదికన పాలన కొనసాగిస్తోందన్నారు. ట్రంప్ మాటలకు తలొగ్గి రష్యాతో ఆయిల్ కొనుగోలు ఉపసంహరించుకోవడం భారత సార్వభౌమాధికారానికి అవమానమని అన్నారు. తక్కువ ధరకు దొరికే ఆయిల్‌ను వద్దనుకొని అమెరికా చెప్పినట్లు వ్యవహరించటం ఏంటని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి నరసయ్య

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముందు, తర్వాత కురిసిన భారీ వర్షానికి జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, అందువల్ల బాధిత రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అఖిలభారత ఐక్యరైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ.. జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న రైతులు తమ పంటలను తీవ్రంగా నష్ట పోయారన్నారు. అదేవిధంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రైవేట్ వ్యాపారుల చేతిలో మోసాలకు గురికావాల్సి వస్తోందన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నారు. తడిసిన మొలకెత్తిన, రంగు మారిన పంటలను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అమర్లపూడిరాము, ముద్ద బిక్షం, నాయిని రాజు, బుర్ర వెంకన్న, కల్లూరి కిషోర్, బానోత్ ధర్మ, పండూరి వీరబాబు, కినరి వెంకటేష్, బైరు వెంకన్న, నకిరికంటి నాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగ పంటలను, ఇళ్లు కోల్పోయిన సాధారణ ప్రజల ఆస్తి నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు మోరరవి డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కుంజ వెంకటేశ్వర్లు, దండి కొమరయ్య, కారం భద్రయ్య, తోలెం మమత, జిగట లక్ష్మయ్య, తెల్లం రాము, కత్తుల ప్రశాంత్, కంగాల గౌతమి, ఈసం ఉపేందర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలి

బూర్గంపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)) ఓటరు జాబితా ఎలాంటి తప్పులేకుండా చాలా పకడ్బందీగా తయారు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ కేటగిరీల వారీగా ఏనిబీఎల్‌వోఈ యాప్‌కు సంబంధించిన అంశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ నిర్వహణ కోసం చేపట్టిన ప్రిపరేషన్ కార్యాచరణలో పురోగతి ఉండాలన్నారు. ఎస్ఐఆర్ నిర్వహణ చేసేకంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002ఎస్ఐఆర్ డేటా 2025ఎస్ఐఆర్ డేటాతో సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ నరసింహారావు, వీర్రాజు, జీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుమారుడి మృతిపై పోలీసులకు తండ్రి ఫిర్యాదు

జూలూరుపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తన కుమారుడిపై విషప్రయోగం చేసి చంపారనే అనుమానంతో తండ్రి గురువారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాయిరాంతండా గ్రామానికి చెందిన జాటోత్ రమేష్(33) గతకొంత కాలంగా గొంతునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నా, తగ్గలేదు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరి రమేష్ చికిత్స పొందుతున్నాడు. దీంతో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి ఆయన మృతిచెందాడు. తన కుమారుడిని గ్రామానికి చెందిన వ్యక్తులు విషప్రయోగం చేసి చంపారనే అనుమానం ఉందని తండ్రి జాటోత్ నాగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అతివేగంగా వచ్చి బస్సును ఢీకొట్టిన లారీ

● ఇద్దరు మృతి.. మరొకరికి గాయాలు

ఖమ్మంక్రైం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. మరొకరికి గాయాలైన ఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. టుటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామానికి చెందిన అలివేలు ఉపేందర్(35) గత కొంతకాలంగా నగరంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఏపీఎస్ఆర్టీసీ కార్గో సర్వీస్‌ను ప్రైవేటుగా నడిపిస్తున్నారు. అతని వద్ద ఎర్రుపాలెం మండలం కొత్తపాలెంకు చెందిన గుండ్ల రామకృష్ణ (22), కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్ కు చెందిన భూక్య చరణ్‌లు నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతూ పార్టుటైంగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఉపేంద్రతో పాటు రామకృష్ణ, చరణ్‌లు రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఖమ్మం కొత్తబస్టాండ్ సమీపంలోని ఆగగా.. బస్సులోని కార్గో సర్వీస్ ద్వారా వచ్చిన వస్తువులను దింపి వారి ఆటోలోకి ఎక్కిస్తున్నారు. ఇదే సమయంలో జార్ఖండ్‌కు చెందిన ఓ లారీ ఐరన్‌లోడ్‌తో వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా.. లారీడ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అతి వేగంగా వచ్చి బస్సు వెనుక భాగాన్ని ఢీకొట్టింది. ఆ తర్వాత పక్కనే వస్తువులు వేస్తున్న ఆటోను ఢీకొట్టి.. ఆ పక్కన ఉన్న పెట్రోల్‌బంక్ గోడను ఢీకొట్టి ఆగింది. ఈప్రమాదంలో బస్సు వెనుక డిక్కీలో ఉన్న వస్తువులను దింపుతున్న అలివేలు ఉపేందర్, గుండ్లరామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా.. అక్కడే ఉన్న చరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతన్ని వెంటనే ఓ ఆసుపత్రికి తరలించారు. లారీడ్రైవర్ ఉత్తమ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామకృష్ణ (ఫైల్)



ఉపేందర్ (ఫైల్)

సత్తుపల్లిలో వైభవంగా మహాపడిపూజ



పూజలు చేస్తున్న ముద్వా విజయబాబు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణ శివారులోని జేవీఆర్ పార్క్ సమీపంలో వేంచేసియున్న శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామి ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ఏకశిల పదునెట్టాంబడి మహా పడిపూజ కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఈ సందర్భంగా టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో మహాపడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మువ్వా దంపతులు శ్రీ లక్ష్మీ గణపతి సహిత సుబ్రహ్మణ్య మహాలక్ష్మీ నవగ్రహ అయ్యప్పస్వామి హోమంలో పాల్గొన్నారు. అనంతరం సాగిన ఆరాధన కార్యక్రమంలో తన్మయత్వంతో నృత్యం చేయగా శ్రీ షిరిడీ సాయిబాబా సేవామందిరంలో ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో సత్తుపల్లి మార్మోగింది. ఈ పడిపూజ కార్యక్రమం కేరళతంత్రి బ్రహ్మశ్రీ మధుసూదనన్ నంబూద్రి, ఆలయ ప్రధాన అర్చకులు వెంకట్ సురేష్ ఆచార్యులచే మహా పడిపూజ నిర్వహించగా గురుస్వామి శ్రీ ద్రోణంరాజు మల్లిఖార్జున శర్మ, శ్రీ డోలక్ సుబ్బారావు స్వామి శిష్య బృందాలచే సంకీర్తనలు చేయగా కేరళ వారిచే సాగిన చెండా వాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరై భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేయగా భక్తులకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు దోసపాటి అమరలింగేశ్వరరావు, బొంతు శ్రీనివాసరావు, గుండు ఉమామహేశ్వరరావులు కోరారు.



పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ఐదుగురి ప్రాణాలు కాపాడిన చెట్టు

- రాళ్లవాగువరదలో కొట్టుకుపోయిన కారు
- అద్దాలు పగలగొట్టుకుని బయటపడిన ఐదుగురు
- తిరుమలాయపాలెం మండలంలో ఘటన
- బాధితులు మహబూబాబాద్ వాసులు

తిరుమలాయపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉధృతంగా ప్రవహిస్తున్న తిరుమలాయపాలెం మండలంలోని కేశ్వాపురం - తిప్పారెడ్డిగూడెం గ్రామాల మధ్య ఉన్న రాళ్లవాగులో ఓ కారు కొట్టుకుపోగా.. అందులోని ఐదుగురిని ఒడ్డున ఉన్న ఓ చెట్టు కాపాడింది. ఖమ్మం- మహబూబాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న రాళ్లవాగు వద్ద బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ. మహబూబాబాద్‌కు చెందిన కొప్పుల రమేష్, చందు, నిహారిక, మధవి, మణిదీప్ బుధవారం తమ కారులో ఖమ్మంలోని బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో తిరుమలాయపాలెం మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన వరుసకు సోదరి అయిన పోతుల నాగమణి ఇంటికి వచ్చారు. అనంతరం బుధవారం రాత్రి తమ స్వగ్రామం మహబూబాబాద్‌కు బయలుదేరారు. ఈక్రమంలో కేశ్వాపురం-తిప్పారెడ్డిగూడెం మధ్య ఉన్న రాళ్లవాగు వద్దకు చేరుకోగా.. అప్పటికే వాగు చప్టాపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోం ది. అయినా కారు వెళుతుందని భావించిన రమేష్.. కారును ముందుకు పోనివ్వగా ప్రవాహ ఉధృతికి కారు వరదలో కొట్టుకుపోయి సుమారు అరకిలోమీటరు దూరం వరకు వెళ్లి వాగుఒడ్డున ఉన్న చెట్టుకు చిక్కుకుంది. దీంతో కారులో ని వారు కారు అద్దాలు పగులగొట్టుకుని బయటపడ్డారు. రాత్రి సమయం లో తమ బంధువుల ద్వారా ఓ ఆటోపిలిపించుకుని మహబూబాబాద్ వెళ్లిపోయినట్టు సమాచారం. ఈ విషయం గురువారం సాయంత్రానికి తిరుమలాయపాలెం పోలీసులకు తెలియగా.. వారు కారుకోసం గాలిస్తున్నారు. అయితే అరకిలోమీటరు దూ రం వరకు కారు కొట్టుకపోయినా మునగకపోవడం, ఒడ్డుకు సమీపంలోనే ఉన్న ఓ చెట్టుకు చిక్కుకోవడంతో కలిసొచ్చింది.

ముస్నేరు.. ముంచెత్తింది

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 12గంటల నుంచి మున్నేరు పరివాహక ప్రాంతంలోని పలు కాలనీ ప్రజలు స్వచ్ఛందంగా పునరవాస కేంద్రాలకు వచ్చారు. వృద్ధులు సైతం తమ వెంట కొద్ది పాటి దుస్తుల మూటలను వెంటతెచ్చుకొని కేంద్రాలకు వచ్చారు. కొందరు తమ బంధువుల ఇళ్లకు వెళ్లారు. పునరవాస కేంద్రాల్లోని వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు. ఖమ్మం నగరంతో పాటు రూరల్ మండలంలోని జలగంనగర్, కరుణగిరి, సారధినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతనగర్, ధంసలాపురం, రూరల్ మండలంలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లోకి ఇళ్లలోకి నీరు చేరడంతో వారిని ఖమ్మంనగరలోని నయాబజార్, ధంసలాపురంలోని ప్రభుత్వ పాఠశాల, రూరల్ మండలంలోని రాజీవ్ స్వగృహ వద్ద ఉన్న స్ప్రింగల్‌లీఫ్ పాఠశాల పునరావాసా కేంద్రాలకు తరలించారు. మొత్తం 191 కుటుంబాలు 473మంది పునరావాస కేంద్రాలకు తరలించారు. అయితే మున్నేరు ముంపు ప్రజలతో పాటు నగరవాసులు గతేడాది సెప్టెంబరు 1న వచ్చిన మున్నేరు ఉప్పెన, మిగిల్చిన నష్టాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది కూడా సెప్టెంబరులో వరద వచ్చిన ప్రమాదస్థాయికి రాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కానీ ప్రస్తుతం వచ్చిన వరద వల్ల ఇప్పటి వరకు స్వల్ప నష్టమే జరిగినా.. ఎగువ నుంచి వరద కొనసాగితే మళ్లీ తమ పరిస్థితేందా? అని ఆందోళన చెందుతున్నారు. ప్రతీఏడాది తాము ఆర్థికంగా చితికిపోతున్నామని, తమను ఆదుకోవాలని మున్నేరు బాధితులు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

కామేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): లింగాల చెరువు అలుగులో చేపల వేటకు వెళ్లి ఒకరు గల్లంతయ్యారు. ఈ ఘటన కామేపల్లి మండల పరిధిలో లింగాలలో గురువారం జరిగింది. చెరువు వరద ఉధృతి పెరగడంతో అలుగులోని చేపల వలలను తొలగించారు. ఈ సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు వలలు పట్టుకొని చేపల వేటకు వచ్చారు. కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ వారిని కట్టడి చేశారు. కానీ పోలీసులు కళ్లు కప్పికొంతమంది చేపలు పట్టే ప్రయత్నం చేశారు. వారిలో గోవింద్రాల గ్రామానికి చెందిన బానోత్ శ్రీను(35) అలుగు పరివాహక ప్రాంతంలో ఉన్న వాగులో జారి పడ్డాడు. గమనించిన తోటి వ్యక్తులు కాపాడే ప్రయత్నం చేసేలోపే వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. ఇంకా ఆచూకీ లభించలేదు.

ఫర్నీచర్ అసిస్టెంట్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫర్నీచర్ అసిస్టెంట్ మూడు నెలల రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ఉపాధి పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువతకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఇందుకు నవంబరు 6న కలెక్టరేట్‌లో డ్రాయింగ్‌పై టెస్ట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యువత ఫర్నీచర్ ప్రొడక్షన్, ఇన్‌స్టలేషన్, మెషిన్ ఆపరేషన్ రంగాల్లో నైపుణ్యం సాధించి స్థిరమైన ఉద్యోగ అవకాశాలు పొంద గలరని పేర్కొన్నారు. అభ్యర్థుల అర్హతలు కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత, 18 -35 సంవత్సరాల వయస్సు, డ్రాయింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత నెలకు రూ.15 వేల నుంచి 30 వేల వరకు వేతనంతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు.

మైనింగ్ స్టాఫ్, అండ్ ట్రేడ్స్ మెన్‌లకు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్

- ఆదేశాలు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, అండ్ ట్రేడ్స్ మెన్‌లకు ఏఐటీయూసీ కృషి వల్ల సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ హయాంలో అనారోగ్యంతో మెడికల్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మైన్స్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చే వారని, కాని 2018 మార్చి నుంచి దానిని నిలిపి వేసి సర్ఫేస్‌లో జనరల్ మజ్దూర్, క్యాటగిరి వన్‌లో పోస్టింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. దీని వల్ల సింగరేణిలో చాలా మంది మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మైన్స్ చాలా మానసికంగా, ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ఇందుకు కారణం అప్పటి గుర్తింపు సంఘం టీబీజీకెఎస్ యాజమాన్యం అవలంబించిన కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకోవడంలో వైఫల్యం చెందినందునే మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మైన్స్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం మార్చి 2018 నుంచి జులై 2025 వరకు జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డు అండర్ గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్ , ట్రేడ్స్‌మెన్స్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు యాజమాన్యం గురువారం ఆదేశాలు జారీచేసిందని , ఇది ఏఐటీయుసి సాధించిన ఘనత అని అన్నారు.

ఫలించని ప్రయత్నాలు

- దొరకని వ్యాను డ్రైవర్ మురళీకృష్ణ ఆచూకీ
- నిమ్మవాగులో ముమ్మరంగా గాలింపు చర్యలు
- రంగంలోకి దిగిన 20 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందం
- రాత్రవడంతో నేటికి వాయిదా

కొణిజర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వచ్చిన భారీ వర్షాలకు కొణిజర్ల మండలం అంజనాపురం సమీపంలోని నిమ్మవాగు ఉధృతికి బుధవారం వ్యాను కొట్టుకపోగా, డ్రైవర్ మురళీకృష్ణ గల్లంతైన విషయం తెలిసిందే. మురళీకృష్ణతో పాటు వ్యాను కోసం వైరా సీఐ వెంకటప్రసాద్, ఎస్ఐ సూరజ్ పర్యవేక్షణలో గురువారం 20 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం ముమ్మరంగా గాలించింది. మధ్యాహ్నం వాగు బ్రిడ్జికి వందమీటర్ల దూరంలో వ్యాను ఉన్నట్లు ఎన్డీఆర్ఎఫ్ బృందం గుర్తించగా.. రెండు క్రేన్లు, రెండు ఎక్స్‌కవేటర్ల సాయంతో వ్యానును బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. చీకటిపడే వరకు ప్రయత్నించినా వ్యాను రాకపోవడం, మురళీకృష్ణ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలను శుక్రవారానికి వాయిదా వేశారు. బుధవారం ఘటన గురించి తెలుసుకున్న మురళీకృష్ణ కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని అతడి ఆచూకీ కోసం ఎదురుచూశారు. అయితే వ్యాను కొట్టుకుపోయే సమయంలో డ్రైవర్ మురళీకృష్ణ క్యాబిన్‌లో ఉండగా.. ఇప్పటికీ వ్యాను క్యాబిన్‌లోనే చిక్కుకుని ఉంటాడని భావిస్తున్నారు. అయితే వాగులో ఇసుకమేట ఎక్కువగా ఉండటంతో వ్యాను లోతులో ఇరుక్కుపోయి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఖమ్మం కాల్వొడ్డులో నీట మునిగిన రేణుక ఎల్లమ్మ దేవాలయం



ఖమ్మం రూరల్ మండలం కేబీఆర్ నగర్‌లో రోడ్లపైనే ప్రవహిస్తున్న వరద నీరు



మోతీనగర్‌లో ఇళ్లను చుట్టుముట్టిన వరద



కస్నాతండా వద్ద బ్రిడ్జిపై నుంచి పెద్ద ఎత్తున ప్రవహిస్తున్న ఆకేరు వరద నీరు

అంతకంతకూ..

- పెరుగుతున్న మున్నేరు ఉధృతి
- అనుక్షణం అండగా అధికార గణం
- ముంపు ప్రాంతాల్లో మేయర్, కలెక్టర్, కమిషనర్ పర్యటన

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావానికి మున్నేరుకు వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతూనే ఉంది. బుధవారం ఉదయం మున్నేరు 8.5 అడుగులు ఉండగా.. గురువారం సాయంత్రానికి ఏకంగా 26అడుగులకు చేరింది. దీంతో మున్నేరు పరివాహక ప్రాంతంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతినగర్, ప్రకాశ్‌నగర్, దంసలాపురం ప్రాంతాల్లోని నివాసాల్లోకి నీరు చేరాయి. బుధవారం సాయంత్రం నుంచే మున్నేరు పరివాహక ప్రాంత వాసులను ఖమ్మం నగర పాలక సంస్థ, పోలీసు, రెవెన్యూ, డీఆర్ఎఫ్ బలగాలు అప్రమత్తం చేశారు. నయాబజార్ కాలేజీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అర్ధరాత్రి 12గంటల వరకు ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను తరలించారు. మొత్తం 71 కుటుంబాలకు చెందిన 170మంది ప్రజలు నయాబజార్ పునరావాస కేంద్రంలో సేద తీరారు. కొన్ని దుస్తులను వెంట తీసుకొని పునరావాస కేంద్రానికి వచ్చారు. అలాగే వారి నివాసాల్లోని విలువైన వస్తువులు, విద్యుత్ పరికరాలను మైదాన ప్రాంతంలోని బంధువులు, స్నేహితుల నివాసాలకు తరలించారు. ఉదయం నుంచి అర్ధరాత్రి 1గంట వరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మున్నేరు పరీవాహక ప్రాంతంలో పర్యటించారు. అర్ధరాత్రి 12గంటల సమయంలోనూ కమిషనర్ అభిషేక్ అగస్త్య నయాబజార్ పునరావాస కేంద్రానికి వచ్చి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఉదయం మున్నేరు ఉధృతి 25అడుగులకు చేరింది. ముంపు తగ్గుతుందని ప్రజలు భావించినా.. ఆ మేరకు తగ్గకపోగా, పెరగడంతో మధ్యాహ్నం 12గంటల నుంచి మున్నేరు పరీవాహక ప్రాంతంలోని ప్రజలు స్వచ్ఛందంగా పునరావాస కేంద్రాలకు వచ్చారు. వారికి అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ ఈఈ కృష్ణలాల్ పర్యవేక్షణలో డీఈ నవ్యజ్యోతి భోజనాల్లో ఎలాంటి రాజీ లేకుండా అక్కడే వంటలు తయారు చేయించారు. ముంపు ప్రభావిత ప్రజలతో పాటుగా అధికారులు సైతం అక్కడే అల్పాహారం తీసుకున్నారు. 14 మంది డీఆర్ఎఫ్ సిబ్బంది 24గంటల పాటు పనిచేసి ముంపు ప్రాంతాల్లోని 71 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గతేడాది సెప్టెంబరు 1న మున్నేరు వరదల అనుభవంతో జిల్లా, కేఎంసీ అధికార యంత్రాంగం అనుక్షణం మున్నేరు ముంపు ప్రభావిత ప్రజలకు అండగా నిలిచింది. 24గంటలు ముంపు ప్రాంతాల్లో అధికారులు పర్యటించి ప్రజలకు భరోసా కల్పించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

అందుబాటులో లేని ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు

గత మూడు నెలలుగా ఖమ్మం నగరంలోనే ఉంటూ మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలకు ముంపు ప్రమాదాలపై అప్రమత్తం అవగాహన కల్పించిన ఎన్ డీఆర్ఎస్ బలగాలు తీరా ముంపు ఏర్పడిన సమయంలో అందుబాటులో లేకుండా వెళ్లాయి. వరంగల్, హన్మకొండ నగరాల్లో వరద తీవ్రత అధికంగా ఉందని ఉన్నత స్థాయిలోని అధికారులు ఆదేశాలు జారీ చేయటంతో గురువారం ఉదయం ఖమ్మం నుంచి వరంగల్‌కు ఎన్‌డీఆర్ఎఫ్ బలగాలు తరలి వెళ్లాయి. బృందాల్లోని కొంతమంది కాకుండా మొత్తం బృందాలు వరంగల్‌కు వెళ్లాయి. కనీసం ఒక్క బృందంలోని సిబ్బందినైనా ఖమ్మంలో ఉంటే అత్యవసర సమయంలో బాధితుల ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

2వేల మందికి పైగా భోజనాలు

మున్నేరు ముంపు ప్రజలు రాత్రి సమయంలో నయాబజార్ పునరవాస కేంద్రానికి భారీగా చేరుకున్నారు. సాయంత్రం 7గంటల నుంచి భోజనాలు ప్రారంభం కాగా.. రాత్రి 9గంటల వరకు వడ్డించారు. మొత్తం 2వేలకు పైగా భోజనాలు జరిగాయి.

బ్యాక్ వాటర్‌తో...

మున్నేరు వంతేన వద్ద చివరి నెంబర్ 26వరకు వరద నీరు రావటంతో వంతేన గోడలకు వరద నీరు తాకింది. దీంతో మున్నేరు సమీపంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్‌కు బ్యాక్ వరద ప్రబావానికి గురై నివాసాల్లోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు రాత్రి స్వచ్ఛందంగా పునరావాస కేంద్రాలకు వచ్చారు.

● ముందుగానే పునరావాసానికి..

నయాబజర్, దంసలాపురంలో ఏర్పాటు చేసిన మున్నేరు ముంపు ప్రజల పునరావాసానికి చిన్న పిల్లల తల్లులు, వృద్ధులు ముందుగానే చేరుకున్నారు. గతేడాది సెప్టెంబరు 1న వ్యాపించిన మున్నేరు ఉప్పెనపై మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

గతేడాది కాళరాత్రి : నర్రా సంధ్య



గత సంవత్సరం వచ్చిన మున్నేరు వరదను తలచుకుంటే ఇప్పటికీ భయం కలుగుతుంది. ఓ కళరాత్రిగా అనిపిస్తోంది. బొక్కలగడ్డలో మేము నివాసం ఉంటున్నాం. గతేడాది రాత్రి సమయంలో ఒక్కసారిగా ఇంట్లోకి నీరు రావటంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాం, ఏడాది మా పాపను వెంట బెట్టుకొని ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని బయటపడ్డాం. ఇప్పుడు మాత్రం 24గంటల నుంచి అధికారులు మా వెంట ఉండి అప్రమత్తం చేశారు. కొద్ది కొద్దిగా వరద రావటంతో మా ఇంట్లోని ముఖ్యమైన సామాన్లు బంధువుల నివాసంలో ఉంచాం. మరికొన్ని సామాన్లు అటుకుపై ఉంచాం. పిల్లలతో పునరావాస కేంద్రానికి వచ్చాం..

ముందస్తు సమాచారంతోనే..

● ఆరెంపుల సుమలత



గత సంవత్సరం వచ్చిన వరదలతో మా ఇంట్లోని ఉప్పు, పప్పు, బియ్యంతో సహా అన్ని వస్తువులు మున్నేరులో కలిసి పోయాయి. ఇల్లు మొత్తం బురద పట్టింది. ఇల్లు శుభ్రం చేసుకోవడానికి వారం రోజులు పట్టింది. వరదల్లో కోల్పోయిన వస్తువులను ఇప్పటికీ సమకూర్చుకోలేక పోయాం. గతేడాది అనుభవంతో గత మూడు నెలలుగా వరదలు, వర్షాలపై ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం తెలుసుకుంటున్నాం. గురువారం మధ్యాహ్నం వరకు 25 అడుగులు ఉండి తగ్గక పోవడంతో పునరావాస కేంద్రాలకు పిల్లలతో వచ్చాం. అల్పాహారం, భోజనాలు, ఇతర సౌకర్యాలు మంచిగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఎలాంటి భయం లేదు.

ప్రభుత్వం అండగా ఉంది : మేయర్, డిప్యూటీ మేయర్

గత మున్నేరు వరదల అనుభవాలతో ఎంతటి విపత్తు వచ్చిన అదుకునేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు అండగా ఉంటారని.. ఈ విషయంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాలైన దంసలాపురం, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్‌లో మేయర్ పర్యటించారు. వరద నీరు చేరిన నివాసాల ప్రజల వద్దకు వెళ్లి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని అవగాహన కల్పించారు. అనంతరం నయాబజార్‌లోని పునరావాస కేంద్రానికి చేరుకొని అక్కడ ప్రజలతో మాట్లాడారు. ముంపు ప్రజలకు తయారు చేస్తున్న వంటలను పరిశీలించి, స్వయంగా వంటలు చేశారు. ముంథా తుఫాన్ ప్రభావం ఖమ్మం నగరంలో లేకున్నా.. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు రావడంతో ఆ వరద ప్రభావం ఖమ్మం మున్నేరుపై పడుతుందన్నారు. ఎలాంటి నష్టాలు లేకుండా చూస్తామని భరోసా కల్పించారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా, కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, ఈఈ కృష్ణలాల్, ఎస్ఈ రంజిత్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఉద్యాన అధికారి బెలం రాధిక, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, డీఈ నవ్య జ్యోతి ఉన్నారు. అలాగే నగరంలోని వెంకటేశ్వరనగర్ వైద్యాధికారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య ముంపు, మైదాన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, నాళం సతీష్, మండడపు మనోహర్‌రావు, ముక్తార్, సాయి ఉన్నారు.



వంటలు చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, ఉప మేయర్ పాతిమాజోహార, అధికారులు



పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న ముంపు బాధితులు



ఖమ్మం వెంకటేశ్వరనగర్‌లో ఇళ్ల చుట్టూ వరద



ఖమ్మం బొక్కల గడ్డలో మున్నేరు వరద నీరు

నిండుకుండలా పాలేరు

- 48వేల క్యూసెక్కుల వరద రాక
- 26అడుగులకు చేరిన నీటిమట్టం



పరవళ్లు తొక్కుతున్న పాలేరు జలాశయం

కూసుమంచి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయానికి వరద కొనసాగుతోంది, గురువారం సాయంత్రానికి అధికారుల అంచనా ప్రకారం సుమారు 45వేల క్యూసెక్కులనీరు పరీవాహకప్రాంతాలనుంచి పాలేరు జలాశయానికి వస్తోంది.ముఖ్యంగా వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో వరద పోటెత్తుతోంది. దీంతో నిండుకుండను తలపిస్తోంది. జలాశయం ఫాలింగ్ గేట్ల ద్వారా బయటకు వదులుతున్నారు. దీంతో పాలేరు ఏటి వారగా ఉన్న, పరిసర ప్రాంతాల్లోని వరిపొలాలన్నీ నీటమునిగాయి. చేతికందాల్సిన పంట నీటిమునుగుతుందని వాపోయారు. అయితే శుక్రవారం ఉదయం వరకు వరద ప్రవాహం ఇలాగే కొనసాగేఅవకాశం ఉన్నట్లు ఇరిగేషన్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. పరీవాహకప్రాంతం ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పాలేరు జలాశయం చుట్టూఉన్న గ్రామాల్లోని వరిపొలాలు సైతం నీటమునిగాయి.

పర్యాటకుల సందడి

జలాశయం నిండుకుండలా మారడంతో పర్యాటకులు సందడిపెరిగింది. దీంతో సెల్ఫీలు తిగేందుకు ఆసక్తి కనబరుస్తుండటంతో ప్రమాదాలు జరగకుండా కూసుమంచి ఎస్ఐ నాగరాజు సిబ్బందిని ఏర్పాటుచేశారు

'ఆపద మిత్ర'లు కీలకపాత్ర పోషించాలి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సహాయక చర్యలలో ఆపద మిత్రలు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. విపత్కర సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలలో చురుగ్గా పాల్గొనేందుకు ప్రతి మండలానికి కొంత మంది ఆపద మిత్రలను ఎంపిక చేసి వారికి అవసరమైన శిక్షణ గతంలో అందించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 300 మంది యువతకు ఆపదమిత్ర లుగా ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చామన్నారు. ఖమ్మం జిల్లా మున్నేరు పరివాహక ప్రాంతంలో గల లోతట్టు ప్రాంతాలైన సారధి నగర్, బొక్కల గడ్డ, అగ్రహారం కాలనీ, వెంకటేశ్వర నగర్, పద్మావతి కాలనీలలో మొంథా తుఫాన్ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆపదమిత్రలు బుధ, గురువారాల్లో మున్నేరు లోతట్టు ప్రాంతాల ప్రజలను చైతన్య పరుస్తూ పునరావాస కేంద్రాలకు తరలించడంలో సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ప్రజలకు తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ, జిల్లా అధికారులతో సహాయక చర్యలలో పాల్గొన్నట్లు కలెక్టర్ అన్నారు.

నేడు వ్యవసాయ మార్కెట్ పునఃప్రారంభం

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టి పొడి వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో నగరంలోని వ్య వసాయ మార్కెట్‌లో కొనుగోళ్లను శుక్రవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో గురు, శుక్రవారాలు వరుసగా రెండు రోజులు సెలవులు ప్రకటించామని గురువారం వాతావరణం అనుకూలం గా ఉండటంతో శుక్రవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు నిర్వహించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు. రైతులు తమ పంటను అమ్మకానికి తీసు కురావచ్చని తెలిపారు.

మెకానిక్‌లకు తీరని నష్టం

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద దాటికి మెకానిక్‌లకు తీరని నష్టం వాటిల్లింది. మున్నేరు పక్కనే ప్రభుత్వ స్థలంలో ఆటోనగర్ ఉంది. దీని పరిధిలో సుమారు 200 దుకాణాలున్నాయి. అయితే పనిచేసుకుంటేనే జీవనం గడిపే సాధారణ మెకానిక్‌లకు మున్నేరు వరద తీరని నష్టాన్ని తెచ్చిపెట్టింది. గురువారం నాటి వరదకు షెడ్లలో ఉన్న కార్లన్నీ నీటమునిగిపోయాయి. మరమ్మతుల కోసం యజమానులు షెడ్లలో పెట్టగా రిపేర్లు చేసిన కార్లు, చేయాల్సిన కార్లన్నీ నీటమునిగి పోయాయి. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామంటూ మెకానిక్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మున్నేరు ఉధృతికి గ్యారేజ్ వద్ద నీట మునిగిపోయిన కార్లు



వరదల నేపథ్యంలో పోలీసుల బందోబస్తు



ఖమ్మంక్రైం,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మున్నేరు సమీప ప్రాంతాల వద్ద పోలీసులు భారీబందోబస్తు నిర్వహిస్తున్నారు. నగర శివారులోని దంసలాపురం వద్ద వరదనీరు ఇళ్లలోకి వస్తుండడంతో పోలీసులు స్థానికుల ఇళ్ల ఖాళీ చేయించి బయటకు తరలించారు. బొక్కలగడ్డ, మోతినగర్ దిగువ ప్రాంతాలకు ప్రజలను వెళ్లనివ్వకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.ఈఏర్పాట్లను సీపీ సునిల్‌దత్, పోలీసులు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఆకేరు, మున్నేరుకు భారీ వరద

- రాకపోకలు నిలిపి వేసిన అధికారులు
- ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు
- కేబీఆర్ నగర్‌లో ఇళ్లలోకి వరద
- నీట మునిగిన వరి, మిర్చి పంటలు





కేబీఆర్‌నగర్‌లో ప్రజలను కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు, పునరావాస కేంద్రంలో భోజనం చేసేందుకు బారులు తీరిన మహిళలు

ఖమ్మంరూరల్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షం తగ్గినా.. వరద ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో ఆకేరు, మున్నేరుకు భారీ వరద వచ్చి చేరుతోంది. మున్నేరు ప్రవాహం ఉదయం 10గంటల సమయంలో 24 అడుగులు ఉండగా సాయంత్రం 5గంటలకు 25 అడుగులపైగా పెరిగింది. ముంథా తుఫాను ప్రభావంతో మండలంలోని మున్నేరు, ఆకేరులు రెండోరోజు గురువారం పెద్దఎత్తున ప్రవహిస్తున్నాయి. బ్రిడ్జిలపై నుంచి సుమారు 5అడుగుల మేర ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిలపై నుండి రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రధానంగా ఖమ్మంనుంచి మహబూబాబాద్ జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారి వాల్యాతండా-ములకలపల్లి వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి భారీగా వరద ప్రవాహం పెరగడంతో రెండు జిల్లాలకు రాకపోకలను నిలిపివేశారు. కస్నాతండా వద్ద ఉన్న ఆకేరు బ్రిడ్జిపై నుంచి సుమారు 5 అడుగుల మేర వరద ప్రవహిస్తుండటంతో కస్నాతండా గ్రామానికి రాకపోకలను నిలిపివేశారు. తీర్థాల వద్ద ఆకేరుబ్రిడ్జిపై నుంచి వరద భారీగా ప్రవహిస్తుండటంతో గోళ్లపాడునుంచి తీర్థా, మంగళగూడెం గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. మున్నేరు వరద సుమారు 25అడుగులపైగా ప్రవహిస్తుండటంతో మున్నేరు ప్రాంతంలోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. పెద్దతండాలోని కేబీఆర్ నగర్‌లో ఇళ్లలోకి వరద చేరింది. వంశీకృష్ణ ఫంక్షన్‌హాల్ పూర్తిగా మునిగిపోయింది. అధికారులు ఆ ప్రాంత ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించారు. వర్షానికి తల్లంపాడు, గుర్రాలపాడు, ఆరెంపుల, కోండాపురం, మంగళగూడెం,తీర్థాలతదితర గ్రామాల్లోని వరి,మిర్చి పంటలు నీట మునిగాయి.

అప్రమత్తంగా ఉండాలి

వరద ప్రవాహం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో మున్నేరు, ఆకేరు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ ప్రజలకు సూచించారు. బుధవారం ఉదయం నుంచి వారు మున్నేరు పరివాహక ప్రాంతంలోనే ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు.

నీళ్లలోనే వరిపొలాలు

కూసుమంచి: మరో రెండువారాల్లో చేతికందాల్సిన పంట నీటమునిగింది. వందలాది ఎకరాల్లో నేలవాలింది. కూసుమంచి, రాజుపేట, గోరీలపాడుతండ, భగవాన్‌తండ, ఈశ్వరమాధారం, పాలేరు, నాయకన్‌గూడెం, జుజ్జులరావుపేట, మల్లాయిగూడెం.. ఇలా చెప్పుకుంటే పోతే అన్ని గ్రామాల్లోనూ దాదాపు పంట నేలవాలింది. చేరువులు, కుంటలు, పంటల కాల్వల సమీపంలో నీరు పోటెత్తడంతో నీటమునిగింది. రైతుల కోరికమేరకు వ్యవసాయశాఖ అధికారి వాణి, ఏఈవోలు పంటలు పరిశీలన చేసి ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

ప్రమాదం అంచున లింగాల చెరువు కట్ట ఎక్స్‌వేటర్‌తో అలుగు తొలగింపు

కామేపల్లి: మండల పరిధిలోని పాతలింగాల చెరువుకట్ట ప్రమాదం పొంచి ఉంది. కామేపల్లిలో బుధవారం రికార్డు స్థాయిలో 105ఎంఎం వర్షపాతం నమోదు అయింది. ఇల్లెందు, సింగరేణి, కామేపల్లి మండలాలకు చెందిన పలు చెరువులు ఉగ్రరూపం దాల్చడంతో వరద పోటెత్తింది. ఈనేపథ్యంలో పాతలింగాల చెరువు కట్ట మధ్యభాగంలో కుంగింది. అధికారులు అప్రమత్తమై మొరం తోలించారు. అయిన కట్ట మీద ఉన్న బీటీరోడ్డు బీటలు ఎక్కువై మరింత కుంగింది. అధికారులు బుధవారం అర్ధరాత్రే ఎక్స్‌వేటర్‌తో అలుగు ప్రాంతం చుట్టు పక్కల మట్టి తొలగించారు. అయినా వరద తగ్గకపోవడంతో అలుగు చుట్టు ఉన్న చేపల వలలను తొలగించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. వరద తీవ్రత తగ్గకపోవడంతో అలుగుకు బరాల బాంబులు పెట్టి పేల్చి వేశారు. వరద వాగు గుండా ప్రవహించేలా చేశారు.



లింగాల చెరువు కట్ట కుంగిన ప్రదేశం

పంటలు పరిశీలించిన ఏడీ సతీష్



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

నేలకొండపల్లి: ఆరెగూడెం, సుర్దేపల్లి, బోదుల బండ, తిరుమలాపురంతండా గ్రామాల్లో పొలాలను కూసుమంచి ఏడీఏ సతీష్, ఎంఏఓ రాధలతో పాటు పరిశీలించారు. 28650 ఎకరాలలో వరి పంటను రైతులు సాగు చేసారన్నారు. మొంతా తుఫాన్ తాకిడికి దాదాపుగా 950 ఎకరాలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఏడీఏ వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఏఓ ఎం.రాధ, ఎంపీడీఓ ఎర్రయ్య, ఏఈఓలు, రైతులు ఉన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని తెలంగాణరైతుసంఘం డిమాండ్ చేసింది. తెలంగాణా రైతు సంఘం నాయకుల బృందం గురువారం వివిధ గ్రామాల్లో తుఫాన్‌కు దెబ్బతిన్న వరిపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతు సంఘం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద నీటమునిగిన వరిపొలం

మున్నేరు నిర్వాసితులకు స్థలాలు ఇవ్వండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు



వరద ప్రాంతంలో బాధితులతో మాట్లాడుతున్న నెల్లూరు

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మున్నేరు నిర్వాసితులకు స్థలాలు ఇవ్వాలని బీజేపీజిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. గురువారం మున్నేరు వరద ప్రభావత ప్రాంతాల్లో పర్యటించారు. బాధితులను పరామర్శించారు. గతబీఆర్ఎస్ ప్రభుత్వం మున్నేరు రిటైనింగ్‌వాల్ నిర్మాణం పేరుతో రూ.150కోట్లు ప్రాజక్టును ప్రారంభించినప్పటికీ ఇంత వరకు ఎందుకు పూర్తి చేయలేక పోయారని ప్రశ్నించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమేపరిహారం ప్రకటించి పంటరుణాలను మాఫీచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లిక అంజయ్య, దారా మల్లేశ్వరి, వీరవెల్లి రాజేష్, జ్వాల నరసింహారావు, కొణతం లక్ష్మీనారాయణ ఆర్‌వీఎస్ యాదవ్, రుద్రగాని మాదవ్, తదితరలు పాల్గొన్నారు.

పొలాల్లోని వరద తొలగించాలి

కామేపల్లి,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పొలాల్లో వరదను వెంటనే తొలగించాలని జిల్లా వ్యవసాయఅధికారి డి. పుల్లయ్య సూచించారు. గురువారం కామేపల్లిలో మునిగిపోయిన పంటలను పరిశీలించారు. రైతులకు సూచనలు చేస్తూ పంటకోతకు ఉన్నట్టయితే పడిపోయిన పంటలను జడలు కట్టడం ద్వారా నిటారుగాఉంచి, మొలకెత్తకుండా 5శాతం ఉప్పుద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ కొగర వెంకటేశ్వరరావు, ఏవో తారదేవి, ఏఈఓ వేదిత,సీఈఓ నాగయ్య రైతులు అజ్మీరా రాందాస్, కొర్రరాములు ఉన్నారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

రఘునాథపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):ముంథాతుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలని,పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శిజాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. వ్యవసాయ పంటలను పరిశీలించారు. నష్టం జరిగిన పంటలను అధికారులు సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పత్తి,మిర్చికి తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు అబ్బాస్, శ్రీరామ్‌నాయక్, షైలాబ్‌బాబు, షేక్ మీరాసాహెబ్, మెరుగు రమణ,కుటుంబరావు,నాగరాజు, ఇమామ్, నరేష్, షరీఫ్, రహీం పాల్గొన్నారు.

మున్నేరు కరకట్ట ఎత్తు పెంచాలి



వరదను పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్:మున్నేరు కరకట్ట ఎత్తు పెంచి భవిష్యత్తులో వరద నష్టం పునరావృతం కాకుండా శాశ్వతచర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో మున్నేరు వరద సంభవించిన బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతినగర్, గణేష్ నగర్, సారదినగర్ తదితర ప్రాంతాల్లో సీపీఎం బృందం పర్యటించారు. బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, బండారు రమేష్, త్రీటౌన్ కార్యదర్శి భూక్యాశ్రీను, కార్పొరేటర్లు యర్రాగోపి, యల్లంపల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యం పెరిగేలా 'ఎఫ్రీ చైల్డ్ రీడ్స్'

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెరిగేలా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం ఖమ్మ ఎన్ఎస్పీ రోడ్ లోని ఎన్ఎస్పీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో మధ్యాహ్నం 3గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగు విద్యాబోధనను గమనించారు. రెండు, మూడోతరగతి గదిలో విద్యార్థులను ఎలావున్నాయి రైమ్స్ అని అడిగారు. బోర్డుపై అక్షరాలను రాసి వాటిని ఉచ్చారణను విద్యార్థులను అడిగి సామర్థ్యాన్ని పరిశీలించారు. జిల్లాలోని ప్రతీవిద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎవ్రీచైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ప్రతీ విద్యార్థి బట్టిపట్టి చదివే విధానాన్నికి స్వస్తి పలికి రీడింగ్ స్కిల్స్ పెరిగేలా ఉపాధ్యాయులు బోధన పద్ధతిని మెరుగుపర్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమం ప్రతీరోజు పాఠశాల సమయాల్లోనే ప్రాథమిక తరగతి విద్యార్థులకు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ ప్రవీణ్, అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మీ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు రక్తదాన శిబిరం

నేలకొండపల్లి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల స్మారకార్థం శుక్రవారం నేలకొండపల్లిలో నిర్వహించనున్న మెగారక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఖమ్మంరూరల్ ఏసీపి తిరుపతి రెడ్డి కోరారు. గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్న మార్కెట్ యార్డును ఏసీపి తహసీల్దార్, సీఐ, ఎస్ఐలతో కలిసి పరిశీలించారు. తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, సీఐ టి.సంజీవ్, ఎస్ఐ పి.సంతోష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, వ్యవసాయ శాఖ సమాయ సంచాలకులు సతీష్, ఎంఏఓ ఎం.రాధ తదితరులు ఏసీపీ వెంట ఉన్నారు.

దిగుమతి, మిర్చి శాఖ ఎన్నికలకు ఆశావహుల పోటీ

ఖమ్మంమార్కెట్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నవంబరు 16న జరగనున్న 'చాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికలకు సంబంధించి వ్యవసాయ మార్కెట్‌లో ప్రధాన భూమిక పోషించే దిగుమతి, మిర్చి శాఖకు ఆశావహులు పోటీ చేస్తున్నారు. బుధవారం మిర్చిశాఖకు అధ్యక్ష, కార్యదర్శులుగా మెంతుల శ్రీశైలం, యడ్లపల్లి సతీషకుమార్ ప్యానల్‌తో పాటు బండారు వీరబాబు, చింతల రామలింగం ఫ్యానల్ నామినేషన్లు దాఖలు చేయగా దిగుమతి శాఖకు అధ్యక్ష, కార్యదర్శులుగా వడ్డె వెంకటేశ్వర్లు, సోమారపు సుధీర్‌కుమార్ ఫ్యానల్‌తో పాటు మరో ఫ్యానల్‌లో కోలేటి నవీన్, అత్మకూరి వెంకటరామారావులు, ఇండిపెండెంట్ ఫ్యానల్‌గా సోమిశెట్టి వెంకటేశ్వరరావు, యర్రా అప్పారావు పోటీ చేస్తున్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న యడ్లపల్లి సతీష్, మెంతుల శ్రీశైలం

విద్య, వైద్యం రంగాలకు ప్రాధాన్యం

- కమ్మ మహాజన సంఘం
- జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న రఘుసత్యనారాయణ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల అభివృద్ధికి కమ్మమహాజన సంఘం ప్రాధాన్యతనిస్తోందని సంఘం అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము అన్నారు. గురువారం నగరంలోని స్వర్ణ భారతి కమ్మ వారి కల్యాణ మండపంలో జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమాజంలో ఉన్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, వారి సేవలకు సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. మీడియా సహకారం మరింత పెరిగితే ప్రజాప్రయోజన కార్యక్రమాలు విస్తరించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు పత్రికలు ప్రతినిధులు, సంఘ వైస్‌ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్లస్వరూపరాణి, పోతినేని భూమేశ్వరరావు, మోతుకూరి సత్యనారాయణ,నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, కోలేటి నవీన్, తాళ్ళూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ పాల్గొన్నారు.

అమెరికాలో నృత్యప్రదర్శన.. సర్వజ్ఞ విద్యార్థిని ప్రతిభ



ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థిని జి.మాన్వి, అమెరికాలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చూపిందని పాఠశాల చైర్మన్ నాగేంద్రకుమార్ తెలిపారు. మమత మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావు, శ్రీమతి అనితా రావు దంపతుల కుమార్తె మాన్వి కళలకు అద్దం పట్టేలా మాన్వి చేసిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుందని తెలిపారు. పాఠశాల చైర్మన్ ఆర్.వి.నాగేంద్ర కుమార్ మాన్వి ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు.

సార్వత్రిక పరీక్ష ఫలితాల విడుదల

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో సెప్టెంబరులో నిర్వహించిన ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ఫలితాలు గురువారం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం విడుదల చేసిందని జిల్లా ఇన్‌చార్జ్ డీఈవో, అదనపు కలెక్టర్ పి శ్రీజ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కూరపాటి మంగపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతిలో మొత్తం విద్యార్థులు 279 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. 128 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇంటర్మీడియట్‌లో మొత్తం విద్యార్థులు 248 మంది పరీక్షకు హాజరుకాగా 108 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కావాల్సివారు నవంబరు4 నుంచి 12 వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని వారు ఆ ప్రకటనలో తెలిపారు. పదో తరగతికి ఒక్కో సబ్జెక్టుకు రీ కౌంటింగ్‌కు రూ. 350, రీవెరిఫికేషన్‌కు రూ.1200, ఇంటర్మీడియట్‌కు రూ.400,రూ.1200 చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యశిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): 47వ డివిజన్ బొక్కలగడ్డ ఏరియాలోని మంచికంటినగర్, మున్నేరు వొడ్డు ప్రాంతాలను జిల్లావైద్యఆరోగ్యశాఖాధికారి బి. కళావతి బాయి సందర్శించారు. ఇళ్లలోకి వచ్చిన వరద నీరు తాగు నీటివసతులతో కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. తాజాగా వండిన వేడి ఆహారాన్ని తీసుకోవాలని, గోరువెచ్చని నీరు తాగాలని, జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి వొళ్ళునొప్పులు వీరోచనాలు, వాంతులు లాంటి ఆరోగ్య సమస్యలు వుంటే సమీపంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో చికిత్స తీసుకోవాలన్నారు. వెంకటేశ్వరనగర్ పరిధిలోని జూబ్లీపుర సబ్‌సెంటర్, నయాబజార్ స్కూల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించి ఓపీ రిజిస్టర్ ను తనిఖీ చేశారు. శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి,హెల్త్‌సూపర్వైజర్లు జయపాల్, శారద,ఏఎన్ఎం శిరీష తదితరులున్నారు.

కస్తాలకు మాతృవియోగం



ఖమ్మంసంక్షేమ విభాగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్, టీజీవోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణకు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి కస్తాల రామతులిశమ్మ(95) గుండె సంబందిత వ్యాధితో గురువారం కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు శుక్రవారం వైరా మండలంలోని కొండకూడిమాలో జరగనున్నాయి.

వానరాల బీభత్సం



కూలిపోయిన షెడ్, ప్రహరీ

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వడివిజన్ జయనగర్‌కాలనీలో వానరాల బీభత్సం అంతా ఇంతాకాదు. కేఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వానరాల సమస్యపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జయనగర్ కాలనీలోని 15వ వీధిలో జిల్లావిద్యాశాఖలో ఉద్యోగం చేసే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. బుధవారంరాత్రి సమయంలో కొతుల గుంపు ఒక్కసారిగావచ్చి కారు షెడ్‌పై పడి బీభత్సం చేశాయి. దీంతో కారు షెడ్‌తో పాటుగా ప్రహరి సైతం కూలీ పోయింది. రూ.1లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆస్పత్రిలో రోగులకు కళ్లజోళ్ల పంపిణీ

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు గురువారం కళ్లజోళ్లను సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్ పంపిణీ చేశారు. ఆప్తాల్మమిక్ విభాగంలో కంటిలోపాలకు సర్జరీలు చేయించుకున్న రోగులకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. జీజీహెచ్‌లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 15,112 మంది రోగులను పరీక్షించగా 1369 మందికి ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో దగ్గరి చూపు కోసం ప్రభుత్వం మంజూరి చేసిన కళ్లజోళ్లను 1280మందికి అందించినట్లు సూపరింటెండెంట్ నరేందర్ తెలిపారు. అన్ని విభాగాలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో ఆర్ఎంవో బి రాంబాబు, ఆప్తాల్మిక్ హెచ్‌వోడీ డాక్టర్ రాముూనాయక్ పాల్గొన్నారు.

ఐహెచ్‌ఐపీపై సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ హెల్త్‌ఇన్ఫర్మేషన్ ప్లాట్ఫామ్(ఐహెచ్ఐపీ)పై జిల్లా వైద్యాధికారి బి.కళావతి బాయి గురువారం సమీక్షించారు. వైద్యఆరోగ్యాశాఖ ద్వారా అందుతున్న సేవలు ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నప్పటికి జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా లబ్ధిదారుల వివరాలు, లభిస్తున్న సేవలు కూడా ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.ప్రైవేట్ ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ల డాటాను సేకరించాలని, అందుకుగాను ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, ఓనర్లు, మేనేజింగ్ డైరెక్టర్ వివరాలు అందించాలన్నారు. సమీక్షలో జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందునాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న తెలంగాణ స్టేట్ వైడ్ ఏరియా నెట్వర్క్ (టీస్వాన్) ఉద్యోగుల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఉద్యోగులు వినతిపత్రాన్ని అందించారు. గురువారం కలెక్టర్‌ను కలిశారు. 6నెలలుగా వేతనాలు యాజమాన్యం చెల్లించడం లేదని, దీనితో కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలను కలెక్టర్‌కు వివరించగా సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా టిస్వాన్ డీహెచ్‌క్యూ ఇంజనీర్ రవి, ఎస్‌డీహెచ్‌క్యూ గోగుల కిరణ్ కుమార్, వీసీ ఇంజనీర్ బి. ఇన్నరెడ్డి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో వైరా ఎమ్మెల్యే ప్రచారం



వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటీ శ్రీహరితో కలిసి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఖమ్మంజిల్లాకు చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మట్టా దయానంద్ ఇంటింటికీ తిరిగి జూబ్లీహిల్స్‌లో ఓట్లు అభ్యర్థించారు.

తుపాకులపై అవగాహన ఉండాలి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో విద్యార్థులు అన్నిరకాల తుపాకులపై అవగాహన కలిగి ఉండాలని అదనపు కమాండెంట్ ఏ.అంజయ్య అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే-2025 దినోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని గంగారం బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల అత్యాధునికమైన తుపాకులను పాఠశాల విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా వాటి సామర్థ్యం, పనితీరును వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.శ్రీధర్‌రాజా, ఎస్‌డీ.రంగారెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫసల్‌బీమా అమలులో లోపం

» రైతులకు తీరని నష్టం

తల్లాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో జరిగిన పంటనష్టాన్ని ఫసల్‌బీమా యోజన పథకాన్ని సమర్థవంతంగా అమలుచేయకపోవడం వల్లే బాధిత రైతులు పంట నష్టపరిహారాన్ని పొందలేకపోతున్నారని బీజేపీ జిల్లా సీనియర్ నేత అపతి వెంకటరామారావు అన్నారు. తుఫాన్‌తో తల్లాడ మండలంలో వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి, వరి, మిర్చిపంటలను గురువారం బీజేపీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ప్రభుత్వం తక్షణమే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనావేసి ఎకరానికి రూ.60వేల పరిహారం అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు చల్లానాగులు, జిల్లా నాయకుడు గాదే కృష్ణారావు, యల్లంకి సుధాకర్, రైతులు పొన్నం వెంకటయ్య, రాయల బద్రయ్య, చీకటి వెంకటేశ్వర్లు, గొర్ల రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమాల పురిటిగడ్డ.. ఉసిరికాయలపల్లి

» సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



జమిలి చిత్రపటానికి నివాళ్ళులర్పిస్తున్న నాయకులు

కారేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు పురిగడ్డ ఉసిరికాయలపల్లి గ్రామం అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మనేని వీరభద్రం అన్నారు. ఇటీవల మృతిచెందిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సహాయ కార్యదర్శి మూడు శోభన్ మాతృమూర్తి జమిలి సంస్మరణ ఉసిరికాయలపల్లిలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి తమ్మనేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమిలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే: ఎమ్మెల్యే



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే

సత్తుపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి అన్నారు. గురువారం వేంసూరు మండలానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు 25మందికి రూ.25,02,900విలువైన కల్యాణలక్ష్మీ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టిల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుందని, యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న క్రమంలో జూబ్లిహిల్స్‌తోపాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. అంతకముందు ఈనెల 26న సత్తుపల్లిలో సింగరేణి సంస్థ, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా సందర్భంగా ఉద్యోగాలు పొందిన కొందరికి జాబ్ ఆఫర్ లెటర్స్‌ను అందించగా వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధురాలి మృతి



రామతులశమ్మ(ఫైల్)

వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకొడిమ గ్రామంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధురాలు కస్తాల రామతులశమ్మ(95) వృద్ధాప్య సమస్యలతో మృతిచెందారు. సాంఘీక సంక్షేమశాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, టీజీవోస్ ఖమ్మంజిల్లా మాజీ అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కస్తాల వెంకటేశ్వరరావు మాతృమూర్తి అయిన రామతులశమ్మ కొండకొడిమ గ్రామంలో అన్నివర్గాల ప్రజలకు తనవంతు సేవలు అందిస్తూ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. రామతులశమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

'మొంథా' బాధితులను ఆదుకోవాలి

- **»** తీవ్ర నష్టంతో ఆందోళనలో రైతులు
- **»** ఎకరాకు 50వేల పరిహారం చెల్లించాలి
- **»** నష్టాన్ని ప్రాథమికంగా అంచనావేసిన ఏఈవోలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని తాళ్లమడ, బేతుపల్లి, రామానగరం, గంగారం తదితర గ్రామాలలో సాగుచేసిన వరి సుమారు 350ఎకరాలలో నేలవాలింది. ఈ సందర్భంగా గురువారం ఆయా గ్రామాలలో పర్యటించి నివేదికను ఉన్నతాధికారులను అందజేసినట్లు వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో సుమారుగా 19,600ఎకరాలలో పంట సాగు చేపట్టగా 2500ఎకరాలలో వరికోతలు ఇప్పటివరకు జరిగ్గా పంటకు నష్టం వాటిల్లినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, తమ సూచనల మేరకు రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

కొణిజర్ల: మొంథా తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం రెక్కలు, ముక్కలు చేసుకుని పండించిన పంట చేతికొచ్చిన సమయంలో మాయదారి తుఫాన్ తమ వెన్ను విరిచిందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తుఫాన్ దెబ్బకు కనీసం పెట్టుబడులు కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే తేమవాశాం పేరుతో ఇబ్బంది పెడుతున్న అధికారులు ఇక తడిచిన పంటను ఏమి కొంటారో అని భయాందోళన చెందుతున్నారు. ఆది నుంచి కూడాపంట చేతికి వచ్చే వరకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కన్నీరుమున్నీరవుతున్నారు



కారేపల్లిలో పంటలను పరిశీలిస్తున్న జాన్‌వెస్లీ

నష్టాన్ని మిగిల్చిన మొంథా

మొంథాతుఫాన్ రైతుల నడ్డివిరిచింది. కొణిజర్ల మండలంలో రైతులు పత్తిని 14వేల ఎకరాల్లో సాగు చేస్తే 4500 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. 8వేల ఎకరాల్లో వరిసాగు చేస్తే 2300 ఎకరాల్లో నష్టం జరిగింది. ఈ నష్టాన్ని వ్యవసాయాధికారులు అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించారు.

నాలుగు ఎకరాల్లో వరి పూర్తిగాపడిపోయింది

గూదే కృష్ణయ్య, తుమ్మలపల్లి రైతు

తుఫాన్‌తో సాగుచేసిన నాలుగు ఎకరాల్లో వరి మొత్తం నేలమట్టం అయింది.చేతికి వచ్చిన పంట నిలువునా నేలకొరిగింది. తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

పది క్వింటాళ్ల దిగుబడే వచ్చింది

భూక్యా వెంకన్న, లక్ష్మీపురం,రైతు

నాలుగు ఎకరాల్లో పత్తినిసాగుచేశా. పది క్వింటాళ్ల తీశా. తుఫాన్‌తో మిగిలిన పత్తి అంతా తడిచిపోయింది. చేలోనే పంట నల్లబారుతుంది. నాలుగు ఎకరాల్లో మొత్తం రూ.80వేలు పెట్టుబడి పెట్టాను. కనీసం పెట్టుబడులు కూడా రావడంలేదు పంట నష్టాన్నిఅధికారులు అంచనావేసి ఆదుకోవాలి.



వరిపంటను పరిశీలిస్తున్న బొంతు రాంబాబు

పంటలను పరిశీలించిన ఏవో

తుఫాన్‌తో మండలంలో దెబ్బతిన్న పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి బాలాజీ పరిశీలించారు. తుఫాన్‌తో 4500 ఎకరాల పత్తి, 2300 ఎకరాల వరి పంటకు నష్టం జరిగిందని ప్రాదమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

వైరా: మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు, ఈదురుగాలులతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గురువారం రైతుసంఘం బృందం ఆధ్వర్యంలో గండగలపాడులో పరిశీలించారు. అలాగే సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కూడా దెబ్బతిన్న వరి, పత్తి పంటలను పరిశీలించారు. నాయకులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, కిలారు శ్రీనివాసరావు, మల్లెంపాటి రామారావు, చిత్తారు మురళీ, కామినేని రవి, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌లో ధర్నా

వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధన కోసం వచ్చేనెల ఏడోతేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద విశ్రాంత ఉద్యోగుల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. వైరా మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం చల్లా కృష్ణారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధన కోసం విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిరసన, ధర్నా చేపట్టామని ప్రధాన కార్యదర్శి మాచర్ల జయశంకర్, ఆర్థిక కార్యదర్శి సామినేని వెంకటేశ్వరరావు, సహా అధ్యక్షుడు షేక్.వలీజాన్ తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, మూడేళ్ల నుంచి మూలన పడి ఉన్న పీఆర్సీ నివేదికను వెంటనే అమలుచేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో నిర్వహించే ఏడోతేదీ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు పైడిపల్లి సత్యనారాయణ, టీవీ.కృష్ణయ్యసూరి, ఎన్.పెంటయ్య, మరికంటి వాసుదాసు, సీహెచ్‌ఎస్‌వీ.ప్రసాద్, జి.సుబ్బయ్య, కె.సరస్వతీ, కె.శారదా, పి.నర్సింహారావు, బీవీ.కృష్ణారావు, ఎస్.ప్రసాద్, కె.జగన్నాథరావు, బి.పంతులు, కొంగర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుట్కాలను విక్రయించొద్దు

ముదిగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమీపాల్లో ఉన్న దుకాణాల్లో మత్తు పదార్థాలైన గుట్కాలు, అంబర్లు విక్రయించొద్దని ముదిగొండ ఎస్ఐలు హరిత, కృష్ణప్రసాద్ హెచ్చరించారు. సీఐ మురళీ ఆదేశాల మేరకు గురువారం ముదిగొండ కళాశాల, పాఠశాలల సమీపంలోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. యువత, విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసయ్యే మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలి

» కల్లూరులో ధాన్యం ఆరబెట్టే యంత్రం ప్రారంభం

కల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం తరుపున మద్దతు ధర పొందేందుకు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలాకు తరలించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. గురువారం కల్లూరు ఏఎంసీలో డ్రయ్యరు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను (ధాన్యం ఆరబెట్టె) జేసి శ్రీనివాసరెడ్డి, సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ ప్రారంభించారు. ప్రభుత్వం తరపున ధాన్యాన్ని ఆరబెట్టె యంత్రాలను అందుబాటులోకి తీసుకోరావడం జరిగిందన్నారు. కేంద్రాల నిర్వహణలో రైతల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌వో శ్రీలత, మార్కెటింగ్‌శాఖ జిల్లా మేనేజర్ ఎంఏ అబ్దుల్ అలీం, ఏఎంసి చైర్మన్ బాగం నీజరదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తల్లపురెడ్డి హనిమిరెడ్డి, తక్కెళ్లపాటి దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి జి సత్యనారాయణ, సూపర్వైజర్ జగదీష్, రైతులు కుంచాల గురవయ్య, బాలనాగేశ్వరరావు, డ్రయ్యర్ ప్రతినిధి సత్తిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.



ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని ప్రారంభిస్తున్న జాయింట్, సబ్‌కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, అజయ్‌యాదవ్

ప్రజలకు ఇబ్బంది లేకుండా డ్రెయినేజీ పనులు

మధిర,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గిన వెంటనే ప్రజలకు ఇబ్బంది లేకుండ అండర్ గ్రౌండ్ డ్రెయినేజి పనులు చేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కాంట్రాక్టర్ వినీత్ రెడ్డి తెలిపారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు మునిపిపల్ అదికారులు, కాంట్రాక్టర్ గురువారం మధిర మునిసిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పనులు గత మే నెలలో ప్రారంభించి రెండు నెలలు నిరాటంకంగా చేసి దాదాపు 30 శాతం పనులు చేసినట్లు వారు తెలిపారు. దసరా తరువాత పనులు చేయటానికి వస్తే మళ్లీ వర్షాలు మొదలయ్యాయని వర్షాలు ఆగిన వెంటనే ఒక పని పూర్తయిన తరువాతనే మరో పని మొదలు పెడతామని ఈ లోపు రోడ్లపై ఏర్పడిన గుంటలను వెంటనే పూడ్చేపని ప్రారంభిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ డిఈ నరేష్ రెడ్డి, తహసీల్దార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏడీఏ

వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మండలంలో దెబ్బతిన్న పంటలను గురువారం వైరా వ్యవసాయశాఖ డివిజన్ ఏడీ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్ పరిశీలించారు. మొంథా తుఫాన్ వర్షాలు, గాలులతో సిరిపురం, దాచాపురం, ముసలిమడుగు, స్నానాల లక్ష్మీపురం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను అధికారులు పరిశీలించారు. ప్రాథమిక నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఏడీఏ తెలిపారు. పడిపోయిన వరిపైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచించారు. ఏఈవోలు వెంపటి కీర్తి, సైదులు, ఎం.రాజేష్, పి.వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

తగ్గిన వైరా నీటిమట్టం

వైరా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో భారీగా వచ్చిన వరద నీటితో వైరా రిజర్వాయర్ నీటిమట్టం గురువారం ఉదయానికి 20.4అడుగులకు చేరుకొని సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా రిజర్వాయర్ పరివాహక వాగుల నుంచి భారీగానీరు వచ్చి చేరింది.

ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడితే.. కఠిన చర్యలు

మధిర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కొందరు అధికారులు సరిగా పని చేయడం లేదని ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టారని ఇలా సరైన వివరణ లేకుండా పోస్టులు పెట్టిన వారిపై అవసరమైతే కేసులు పెడతామని తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ హెచ్చరించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అకాల వర్షాలకు మధిర ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీల్లో వర్షం నీరు ఇళ్లల్లోకి వచ్చిందన్న విషయాన్ని కాలనీ వాసులతో పాటు కొన్ని రాజకీయ పార్టీల వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. మునిసిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని జేసీబి సాయంతో సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అక్కడే ఉండి పని చేయించామని అన్నారు. అందరూ నిబద్ధతతో పనిచేసే అధికారులే ఉన్నారని తెలిపారు.

ఆలయ పునఃనిర్మాణానికి నిధుల మంజూరు



నిధుల మంజూరు జీవో కాపీలను అందజేస్తున్న నాయకులు

చింతకాని, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం పునఃనిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫారసు మేరకు ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంటు నుంచి రూ.40 లక్షలు మంజూరు చేసింది. ఆలయం శిథిలావస్థకు చేరి భారీ వర్షాల సమయంలో గర్భగుడిలోకి నీరు చేరి పూజా కార్యక్రమాలకు ఇబ్బందులు కలుగుతుండడంతో సమస్యను జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు కొప్పుల గోవిందరావు, ఆలయ అర్చకులు ఇంగువ విద్యాసాగర శర్మ భట్టి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన భట్టి నిధులు మంజూరుకు సహకరించారు. గురువారం నిధులు మంజూరి జీవో కాపీను ఆలయ కమిటీకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. నిధులు మంజూరికు సహకరించిన భట్టికు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ గొడుగు రమేష్, ఆలయ కమిటీ సభ్యులు చొప్పర రంగారావు, వంకాయలపాటి ప్రసాద్, వెంకటేశ్వర్లు, మేకపోతుల నాగేశ్వరరావు, యలమద్ది ప్రసాద్‌రావు, తాళ్ల రామారావు, కొప్పెర రాంబాబు, గురిజాల నరసింహారావు, కట్ల కృష్ణయ్య, రామారావు, నెర్సుల బక్కయ్య, శ్రీరాములు నాగేశ్వరరావు, జమలయ్య పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల రాస్తారోకో

కల్లూరు, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ప్రొఫెషనల్ కళాశాలల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ కల్లూరులో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వరంలో విద్యాసంస్థల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ సెంటర్‌లో విద్యార్థులు రాస్తారోకో చేశారు. కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో నాలుగు సంత్సరాల స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయలేదని, పెండింగ్‌లో ఉన్న నిధులు రూ.8,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యారంగలో నెలకొన్న సమస్యలను పరిష్కరించక పోతే విద్యార్థులను, తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి భానుశ్రీకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు వరుణ్, సందేశ్, అమన్, శ్రీనివాస్, గీతిక, భూమిక, మనీషా, బార్గవిపాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఏన్కూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో ఏన్కూరులో దెబ్బతిన్న పంటపొలాలను గురువారం కృషివిజ్ఞాన కేంద్రం వైరా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితాదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ టి.పావని, ఫణిశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వరిలో నీరు నిల్వ ఉంచకుండా వచ్చిన వరద వచ్చినట్టు బయటు వెళ్లేలా చూడాలన్నారు దీనివల్ల నీటిలో తడిసిన గింజ రంగు మారదన్నారు. కోత సమయం ఉన్న పంటలో తెగుళ్ల కట్టడికి ప్రోపికోనజోల్ 1ఎంఎల్ లేదా టేబులకోనజోల్ ప్లస్ ట్రైఫ్లాక్సీస్టాబిన్ 0.49 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవోలు భాగ్యలహరి, బాలకృష్ణ పాల్గొన్నారు.